


# నిజంగా అంతేనేమో

ఆచంట సుధాకర్

విశ్వాంతరాళంలో, నవగ్రహాల్లో కకటైన భూగ్రహంమీద ఉత్తరార్ధ గోళంలో వున్న అన్ని ఖండాలోకి పెద్ద దయిన ఆసియా ఖండంలో ఉపఖండంలాంటి భారత దేశంలో దక్షిణాన ఒకానొక సిటీ, అంటే నగరంలో నవంబరు రెండ తారీఖున, సంవత్సరం 1984, కుటుంబరావు అనే ఓ మధ్యతరగతి కుటుంబీకుడు, క్లర్క్ ఉద్యోగం వెంగబెట్టా అన్ని కటింగులూ పోగా, వెయ్యి రూపాయలు రావడం గగనంగా ఉంది. వెలాఖరుకి ఇంట్లో పప్పులు మాట ఎలా ఉన్నా అప్పులు మటుక్కు దండిగా ఉండేవి

పోతేనండీ ఆ కుటుంబరావు రెండవ తారీఖున ఇంతకీ ఏం చేశాడో చెప్పనేలేదు, వెళ్లాడండి బజారుకి. అత్యవసర సరకులు మాత్రమే కొనడానికి. అతని చేతుల్లో రెండు సంచీలు ఉన్నాయి. రెండు సంచీలు సరకులకే అనుకుంటున్నారేమో! కాదు. అందులో ఒకటి అతని పర్సు. ఆ సంచీనిండ రూపాయల కట్టలు ఉన్నాయి. ఇంకో సంచీ సరకులకి.

కూరగాయల మార్కెట్టులో ప్రవేశించాడు కుటుంబరావు. ఉన్న కాస్త కూరగాయల్ని పీల్లజల్లి అందంగా పేర్చిపెట్టారు. నిగనిగ లాడుతున్న వంకాయల్ని చూసి, ధరెంతో అడిగాడు కుటుంబరావు. "అం తీసికోండి సార్ ఈరోజు భలే చౌకలో పోతున్నాయి, ఎనిమిది రూపాయలు కిలో. అదే చౌక కాబట్టి ఎలాగో ఓ పావుకిలో కొన్నాడు. గట్టిగా రెండేనా తూగని వంకాయలకి బిళ్లల్లా రెండురూపాయలు చెల్లించాడు. ఈలోపున ప్రక్కనే అరుస్తోంది ఒక అమ్మి, "రండి సార్, ఘుమఘుమలాడే కొత్తిమీర తీసికోండి రూపాయకి కట్ట, కర్వేపాకు రూపాయన్నర కట్ట చారులో అవసరమయ్యే వస్తువులే వెయ్యలేకపోతూంటే ఇంకా సువాసన ద్రవ్యాలు ఏం వెయ్య గలం అనుకుంటూనే చెరొకకట్టా కొని, కాస్త ముందరికి వెళ్ళాడు. ఒకచోట ఆనపకాయ (సొరకాయ) కనపడింది. ఎంతయ్యా? అంటే పన్నెండు రూపాయలు చెప్పాడు.

వెధవది మా రోజుల్లో రెండ రూపాయల కిచ్చే, ఆనపకాయ పన్నెండు రూపాయలా అనుకొన్నాడు. అంటే వాళ్ళరోజుల్లో రెండు రూపాయలు చౌక అన్నమాట. కొన్నేళ్ళకి మనంకూడా అల్లాగే అనుకోవల్సి వస్తుందేమో....ఇంక ఇలా మన కుటుంబరావు కూరగాయల కొనడం చూస్తే మనకు మతిపోతుంది. కుటుంబరావు డబ్బుసంచీ తేలిక పడుతోందికానీ సరకుల సంచీమాత్రం బరువెక్కటం లేదు.

ఇంక మార్కెట్టునుండి బయటపడి బజారులోపడ్డాడు. కుటుంబరావు దృష్టి అందంగా అలంకరించిన స్పెషల్‌పత్రిక 'దీపావళి జ్యోతి' మీదపడ్డది. చూడగానే కొనాలని మనసు తహతహలాడింది. జడుస్తూనే ధర అడిగాడు. "సార్! ఈసారి దీపావళిజ్యోతి ఎక్కువ పేజీలతో అనేక ఆకర్షణలతో అతితక్కువ ధరతో వెలువడింది సార్ స్పెషల్ ఇస్యూ, కాపీ నూటయేభై రూపాయలే సార్! ప్రతిసారీ రెండువందల రూపాయలుండేది. కుటుంబరావ్ సంచీలో డబ్బులెక్క చూసుకొన్నాడు. 140 రూపాయలు మాత్రమే ఉన్నాయి. రూపాయి తక్కువైనా ఇచ్చేది లేదన్నాడు. (అంటే అప్పుడు తక్కువంటే రూపాయ అన్నమాట!) కుటుంబరావు చేతిని ఆ 'దీపావళి జ్యోతి' అలంకరించాలని, పావనం చేయాలని ఉందేమో! అటుగా అనుకోకుండా తన స్నేహితుడు రావడము, ఆతనూ 'జ్యోతి' అంటే చెవి కోసుకొనేవాడు కాబట్టి మిగిలిన డబ్బిచ్చి కొనిపించాడు. కుటుంబరావు కొంటే తనూ తీసికొని చదవచ్చుకదా అన్నస్వార్థం లేకపోలేదు లెండి ఆ స్నేహితుడికి.

డబ్బు సంచీ ఖాళీచేసుకొని అప్పటికే వర్షం పడేటట్టుగా ఉండే సరికి రిక్షా బేరమాడాడు. మైలుదూరం ఉన్న ఇంటికి రిక్షావాడు పది రూపాయలడిగాడు. అదేమిటయ్యా అంటే! పది రూపాయలకి అర్థకిలో నూకలు రావడంలేదని ధరలన్నీ ఏకరువు పెట్టసాగాడు.

బజారులో ప్రతివాడి నోట విన్న ధరలకే తల తిరుగుతున్న కుటుంబరావుకి ఇది మరో తలనెప్పి అనిపించి కాలిస త్తువ చూపించాడు.

అదండి కుటుంబరావుగారు గంపెడు నోట్లు (ఏం నోట్లనుకున్నారు, రూపాయ నోట్లు) తీసికెళ్ళి గుప్పెడు సరుకులతో ఇంటి కొచ్చాడు. పందొమ్మిదివందల ఎనభై నాలుగో సంవత్సరం సంగతి అదీ అన్నమాట.

★★★